ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 22 అక్టోబరు 2025

వైభవంగా వెలుగుల పండుగ

- భక్తిశ్రద్ధలతో గౌరీ కేదారేశ్వర వ్రతాలు
- ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు

ఇంటింటా ఆనందోత్సాహాలతో దీపావళి పర్వదినం



పల్లె పల్లెనా.. పట్టణాల్లో కాంతులు విరజిమ్మేలా దీపావళి పండుగ అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఆశ్వయుజ అమావాస్య సోమవారం రోజున జిల్లా ప్రజలు దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మిఠాయిలు పంచిపెడుతూ టపాసులు పేలుస్తూ చిన్నా పెద్దా అనే తేడా లేకుండా సందడి చేశారు. నరకాసురుడిని శ్రీకృష్ణ భగవానుడు వధించిన శుభసందర్భంగా బాణసంచాలు పేల్చి దీపాలు వెలిగించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ప్రజలు దీపావళి పండుగను జరుపుకున్నారు. చీకటిని పారద్రోలి జీవితాల్లో వెలుగులు నింపాలని వేడుకున్నారు. సోమవారం తెల్లవారు జామునుంచే తలంటు స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి స్థానిక దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆంధ్రజ్యోతి



హైదరాబాద్‌లోని తన స్వగృహంలో దీపాలు వెలిగిస్తున్న మానుకోట మాజీ ఎంపీ మాలోతు కవిత



మహబూబాబాద్‌లో క్రాకర్స్ కాలుస్తున్న యువతులు

8



మానుకోటలో కుటుంబ సభ్యులతో బాణా సంచాలు కాలుస్తున్న మాజీ మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి-సౌజన్య దంపతులు



జిల్లా కేంద్రంలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి..

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్
- మానుకోటలో ఘనంగా పోలీస్ ఫ్లాగ్ డే



మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల ధన, మాన ప్రాణ రక్షణలో అహర్నిశలు కృషి చేస్తూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో స్మృతిపరేడ్ నిర్వహించారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. 1959 అక్టోబరు 21న సీఆర్‌పీఎస్ ఎస్సై కరమ్‌సింగ్ నాయకత్వంలో 20 మంది

(మిగతా 8లో..)

బాలికపై వీధికుక్కల దాడి

తీవ్ర గాయాలు



వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డ బాలిక

గార్ల అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కలు బాలికను తీవ్రంగా గాయపరిచిన సంఘటన గార్ల మండల పరిధిలో సరిహద్దుతండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సరిహద్దు తండాలో భూక్యా హీమశ్రీ అనే రెండేళ్ల ఇంటి ఎదుట ఆడుకుంటోంది. ఈ క్రమంలో బాలికను విధి కుక్కలు వెంటబడి తీవ్రంగా గాయపర్చడంతో తల్లిదండ్రులు బాలికను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ హనుమంతరావు ప్రాథమిక చికిత్స జరిపారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ తెలిపారు.

చిగురిస్తున్న ఆశలు

ఎట్టకేలకు దేవాదుల పథకం పూర్తికి సర్కారు కసరత్తు

దేవాదులపై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తుండటంతో చివరి ఆయకట్టు వరకు గోదావరి జలాలు అందుతాయనే ఆశ రైతాంగంలో కలుగుతోంది. ఓరుగల్లును సస్యశామలం చేయాలనే లక్ష్యంతో 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దేవాదుల పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, దేవాదుల నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు టెండర్లు ప్రక్రియను ప్రారంభించింది. అయితే మొదటి, రెండో దశ పనులు పూర్తయినప్పటికీ కీలకమైన మూడో దశ పనులకు భూ సేకరణ అడ్డంకిగా మారింది. పెండింగ్‌లో ఉన్న 2,869 ఎకరాల భూ సేకరణతో పాటు 767కి.మీ గ్రావిటీ కెనాల్ నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ప్రభుత్వం నీటిపారుదలశాఖ అధికారులపై ఒత్తిడి తెస్తోంది. అలాగే కొత్తగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా ఎస్సారెస్పీ-2 కింద దేవాదుల ద్వారా గోదావరి జలాలను అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

2003 జూన్ 16న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రూ.4,400 కోట్ల అంచనా వ్యయంతో దేవాదుల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అయితే ఈపీసీ విధానంలో పిలియిన టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. దేవాదుల ప్రాజెక్టును రీడిజైన్ చేసింది. మూడు దశల్లో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకుని ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.4,400 కోట్ల నుంచి రూ.6,016 కోట్లకు పెంచి పనులు ప్రారంభించింది. ఆ తరువాత పనుల్లో జాప్యం జరగడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరలు సైతం భారీగా పెరగడంతో 2008లో మరోసారి అంచనా వ్యయాన్ని రూ.9,427.23కోట్లకు పెంచారు. ఆ తరువాత 2017లో అప్పటి సీఎం కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును రీ డిజైన్ చేయటంతో భారీగా ఖర్చు పెరిగింది. దీంతో రూ.13,445.44కోట్లకు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని మరోసారి పెంచారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో దేవాదులను చేర్చి, రైతాంగానికి సాగునీరు అందించేందుకు పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు ప్రయత్నాలు చేపట్టింది. అందులో భాగంగా అంచనా వ్యయాన్ని రూ.18,055 కోట్లకు పెంచింది. మొత్తంగా ఇప్పటివరకు దేవాదుల ప్రాజెక్టుపై రూ.14,269.63 కోట్ల వరకు ఖర్చు చేసింది. అయితే ప్రాజెక్టు పూర్తికావడానికి ఇంకా రూ.4,230 కోట్లు అవసరంగా ప్రభుత్వం గుర్తించింది. 2005-06 నుంచి 2025-06 ఆర్థిక సంవత్సరం వరకు అంటే.. పాతికేళ్లలో దేవాదుల అంచనా వ్యయం సుమారు రూ.12వేల కోట్లకు పైగా పెరిగింది. తొలుత 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 5,56,722 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలిదశ నుంచి మూడు రిజర్వాయర్లను, నాలుగు పంపుహౌ‌ఎల ద్వారా 5.18టీఎంసీల నీటిని లిఫ్టు చేసి, 1,23,768 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. రెండో దశలో 9రిజర్వాయర్లు, ఏడు పంపుహౌస్‌ల ద్వారా 7.25టీఎంసీల నీటిని ఎత్తిపోసి 1,93,164 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఇక కీలకమైన మూడో దశ పనులు పూర్తి అయితే 10 పంపుహౌ‌ఎల ద్వారా 25.75 టీఎంసీల నీటిని లిఫ్టుచేసి 2,39,790 ఎకరాలకు సాగునీరు అందనుంది. మొత్తం దేవాదుల ప్రాజెక్టు ద్వారా 170 రోజుల్లో 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 5,56,722 ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీటితో పాటు భూగర్భ జలాలతో సాగులో ఉన్నా 58,028 ఎకరాలను కలుపుకుంటే మొత్తంగా దేవాదుల ద్వారా 6.14 లక్షల ఎకరకాలకు సాగునీరు అందించట్టు అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.



దేవాదుల వద్ద ఇన్‌టెక్‌వెల్ (ఫైల్)

ఎస్సారెస్పీ-2కు దేవాదుల నీళ్లే..

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు రెండు దశల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ-1 కింద 3,64,078 ఎకరాల్లో, ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టు ఉందని అంచనా. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఈ ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా గత ప్రభుత్వం పేర్కొంది. అయితే సమ్మక్క సాగర్ నిర్మాణంతో దేవాదుల ఎత్తిపోతల కింద కొత్త ఆయకట్టును ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీంతో ఎస్సారెస్పీ-2 కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి డీపీఆర్‌లో చూపించింది. రెండు ప్రాజెక్టుల కింద ఎస్సారెస్పీ ఆయకట్టును చూపించటంతో సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు నిలిచిపోవటంతో ప్రత్యామ్నాయంగా దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ప్రభుత్వం సీడబ్ల్యూసీ అనుమతి పొందింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పాలకుర్తి నియోజకవర్గంలో 44,942 ఎకరాలు, వర్ధన్నపేటలో 9,012 ఎకరాలు, డోర్నకల్‌లో 55,558 ఎకరాలకు ఎస్సారెస్పీ-2 ద్వారా గోదావరి జలాలు అందుతున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టుకు దేవాదుల ద్వారా గోదావరి జలాలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

భూ సేకరణే అడ్డంకి..

దేవాదుల ఎత్తిపోతలకు ప్రధాన అడ్డంకిగా భూసేకరణ ఉంది. మూడు దశల్లో దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం

(మిగతా 7లో..)

- పాతికేళ్లుగా సా..గుతున్న ప్రతిష్ఠాత్మక ఎత్తిపోతల పథకం
- ప్రాజెక్టుకు సవాల్‌గా మారిన భూ సేకరణ
- ఇంకా 2,869 ఎకరాల భూసేకరణ.. 767 కి.మీ. గ్రావిటీ కెనాల్ నిర్మాణం పెండింగ్
- 5.56 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం కాగా, 3.17 లక్షల ఎకరాలకే సాగునీరు
- ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యంతో భారీగా పెరుగుతున్న దేవాదుల వ్యయం
- రూ.6,016 కోట్లతో ప్రారంభమై.. రూ.18,055 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- ఎస్సారెస్పీ-2 కింద ఉన్న ఆయకట్టుకు కూడా ఇక దేవాదుల నీళ్లే

తడిసి మోపెడు..



- స్థానిక ఎన్నికల ఆలస్యంతో ఆశావాహులపై ఆర్థిక భారం
- రిజర్వేషన్‌ల ఖరారుతో పల్లెల్లో నేతలకు పెరిగిన ఖర్చు
- ఎన్నికలకు ముందుగానే పోటీదారుల జేబులకు చిల్లు
- జిల్లాలో 482 సర్పంచ్‌లు.. 193 ఎంపీటీసీలు... 18 జడ్పీటీసీలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతుండడంతో పోటీదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రోజు రోజుకు ఆలస్యం కావడంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలక మండళ్ల పదవీ కాలం ముగిసిన దగ్గరి నుంచి స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వస్తాయో..? పాత రిజర్వేషన్‌లుంటాయా లేక మారతాయా? అని నేతల్లో ఉత్కంఠ మొదలైంది. గ్రామా ల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయిలో జడ్పీటీసీలుగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు గత పాలకమండళ్ల పదవీ కాలం పూర్తి కావడంతోనే ఇక వారి లాబీయింగ్ మొదలు పెట్టారు. అటు సీటు కోసం జిల్లా స్థాయి నాయకుల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తూనే మరో పక్క పల్లెల్లో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తూ వస్తున్నారు. గ్రామాల్లో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే కొంత మేరకు ఖర్చు చేస్తూ వస్తున్నారు. గ్రామాల్లో ఆపద, సంపదలకు సహాయం చేయడంతో పాటు యువతకు క్రీడా పోటీల నిర్వహణ, క్రికెట్ కిట్టులాంటి క్రీడా సామగ్రిని ఇప్పించడం లాంటి వాటికి ఆశావాహులు ఆర్థిక సహాయం అందిస్తూ ఊర్లలో పట్టు సాధిస్తున్నారు. ఈక్రమంలో ఎన్నికలు రోజు రోజుకు ఆలస్యం కావడంతో వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. గతంలో రిజర్వేషన్‌లు ఖరారు కాక ముందు ఎవరికి అవకాశం వస్తుందో నని అన్ని సామాజిక వర్గాల ఆశావాహులు అంతా తమకు తోచిన విధంగా కార్యక్రమాలు నిర్వహించగా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్‌లు ఖరారు కావడంతో రిజర్వేషన్ అనుకూలంగా వచ్చిన సామాజికవర్గం నేతలకు మాత్రమే అవకాశం ఉండడంతో వారిపై ఆర్థిక భారం పెరిగి పోయింది.

జిల్లాలో 482 సర్పంచ్‌లు.. 193 ఎంపీటీసీలు..

జిల్లాలో 18 మండలాల పరిధిలో 482 గ్రామ సర్పంచ్ స్థానాలుండగా 193 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇక 18 మండలాలకు ఎంపీటీసీ స్థానాలతో పాటు 18 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం 2024 ఫిబ్రవరి మాసంతో పూర్తికాగా అదే సంవత్సరం జూన్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవీ కాలాలు పూర్తయ్యాయి. అప్పటినుంచి ఎన్నికల నిర్వహణ జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకు పోవడంతో ఎన్నికలు కాస్త ఆలస్యమవుతూ వచ్చాయి. ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయించి వాటి ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికలకు ఈనెల 11న నోటి ఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు స్వీకరించగా హైకోర్టు దానిపై స్టే ఇవ్వడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం

(మిగతా 8లో..)

అడవి దున్న దాడిలో వ్యక్తి మృతి





కార్లాయిలో గోవిందు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

కొత్తగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అడవి దున్న దాడిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కార్లాయి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కార్లాయి గ్రామానికి చెందిన కల్తీ గోవిందు(50) మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18(శనివారం)న మేకలు మేపేందుకు అడవిలోకి వెళ్లాడు. సాయంత్రం మేకలు తిరిగి గ్రామానికి వచ్చాయి. కాని గోవిందు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గోవిందు కోసం అడవిలో గాలించారు. సోమవారం కుళ్లిన స్థితిలో ఉన్న గోవిందు మృతదేహాన్ని గుర్తించారు. గ్రామస్తులు పోలీసుల దృష్టికి విషయంను తీసుకెళ్లడంతో సంఘటన స్థలంకు చేరుకుని ఎస్సై రాజ్‌కుమార్ విచారణ చేపట్టారు. గోవింద్ మృతదేహం పక్కన అడవిదున్న పిల్ల మృతదేహం ఉండడంతో గోవిందు అడవిదున్న మృతదేహాన్ని పరిశీలిస్తుండగా తల్లి అడవి దున్న జరిపిన దాడిలో గోవిందు మృతి చెందినట్టు నిర్ధారణకు వచ్చారు. మృతుడికి భార్య పద్మ ఉన్నారు. మృతుడి మరదలు కుమారుడు పిడబోయిన సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

ఘనంగా దీపావళి పర్వదిన వేడుకలు



కుమ్మరికుంట్లలో బాణసంచాను కాల్చుతున్న చిన్నారులు

దంతాలపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం దీపావళి పండుగను ప్రజలు అంగరంగ వైభోవంగా జరుపుకున్నారు. యువకులు, మహిళలు బాణాసంచాను కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో రాజాస్థాన్‌కు చెందిన వ్యాపారులు లక్ష్మిపూజను నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌పురోహిత్ ప్రవీణ్, ఠాకూర్, ఇతర మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రేపే ఈజీఎస్ ఓపెన్ ఫోరం

దంతాలపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈజీఎస్ (సామాజిక తనిఖీ)లో భాగంగా ఓపెన్ ఫోరంను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో విజయ పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు గ్రామంలో ఇంటింటా ఈజీఎస్ పనులపై గ్మారమ సభను ఏర్పాటు చేసి ఈ నెల 23న ఓపెన్ ఫోరంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఓపెన్ ఫోరానికి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏ ఇతర సంబంధించిన అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే సిబ్బంది, అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తామన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే బీసీనే సీఎం

- బీజేపీ నేతలు గాదె రాంబాబు, గుగులోత్ శంకర్ నాయక్
- మంగమ్మకు పరామర్శ



మాట్లాడుతున్న బీజేపీ నేతలు రాంబాబు, శంకర్‌నాయక్

మరిపెడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకా బీసీనే సీఎం చేస్తామని ఇప్పటికే బీజేపీ హైకమండ్ ప్రకటించిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు, గుగులోత్ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం వారు స్థానిక విశ్రాంతి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీనే సీఎం అయ్యాక బీసీలదేపై చేయి ఉంటుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను ఇప్పటికే మోసం చేశాయని, ఇంకా చేయాలని చూస్తున్నాయన్నారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అనుకూలమని గుర్తు చేశారు. అనంతరం బీజేపీ టౌన్ అధ్యక్షురాలు మంగమ్మ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఆమెపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేశ్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షురాలు దేవిక, భూక్యా కాంతమ్మ, గంగాధర్, మంగమ్మలింగంనాయక్, బింగి రమేశ్, భాస్కర్, సుధాకర్, హరికృష్ణ, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలను వృథా కానివ్వం

మరిపెడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమర వీరుల త్యాగాలను వృథాకానివ్వమని మరిపెడ అదనపు ఎస్సై కోటేశ్వర్ రావు అన్నారు. పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా సీలేరు-బలిమెల ఘటనలో నక్సలైట్ల ఘాతానికి బలైన మరిపెడబంగ్లా వాసి అమర పోలీస్ దుస్స ఉదయ్‌నాగ్ స్మారక స్థూపం వద్ద ఆయనకు మరిపెడ పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్సై మాట్లాడారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులను ఎన్నటికీ మరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

దంతాలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై చందర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎందరో పోలీసులు విధి నిర్వహణలో వీరమరణం పొందారన్నారు. రక్షణలో భాగంగా పోలీసుల సేవలు



దంతాలపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కొనియాడదగిందన్నారు. దేశ రక్షణతో పాటు ప్రజలకు అన్ని రంగాల్లో రక్షణగా నిలుస్తున్న పోలీసులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన గ్రానైట్ లారీ

- క్లీనర్‌కు తీవ్ర గాయాలు

తొర్రూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిద్రమత్తులో లారీ డ్రైవర్లు డివైడర్లను ఢీకొట్టిన సంఘటనలు తొర్రూరు పట్టణంలో మంగళవారం చోటు చేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ నుంచి విజయవాడ వెళ్తున్న గ్రానైట్ లారీ మంగళవారం తెల్లవారు జామున 4గంటలకు తొర్రూరు బస్టాండ్ సమీపంలో సిగ్నల్ వద్ద డివైడర్‌ను ఢీకొని అదుపుతప్పి లారీపై ఉన్న బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ట్రాఫిక్ లేకపోవడంతో తీవ్ర ప్రమాదం తప్పింది. పండుగ ముగియడంతో రోడ్డుపై వెళ్తున్న వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మొదట క్రేన్ సాయంతో లారీని తొలగించారు. బండ రాళ్లు రోడ్లపైనే ఉన్నాయి. పెట్రోల్ బంక్ ఎదుట మరో లారీ డివైడర్‌ను



రోడ్డుపై పడిపోయిన గ్రానైట్ రాళ్లు

ఢీకొట్టడంతో డివైడర్ పూర్తిగా దెబ్బతింది. ఈ రెండు ప్రమాదాల్లో క్లీనర్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

న్యాయం కోసం వెళ్తే నిందితుడిని చేశారు

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్
- అంబేద్కర్ విగ్రహానికి వినతి

చిన్నగూడూరు (మరిపెడ), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : న్యాయం కోసం రక్షణ నిలయానికి వెళ్తే వృద్ధ రైతునే నిందితుడిని చేశారని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ ఆరోపించారు. మంగళవారం చిన్నగూడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఓ రైతుకు జరిగిన అన్యాయంపై వినతి పత్రం ఇచ్చి అక్కడే ఆ రైతుతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భీమానాయక్ మాట్లాడారు. చిన్నగూడూరుకు చెందిన నీలం శంకరయ్య తన భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టగా కొందరు ఆ భూమి తమదేనని అంటూ నిర్మాణంలో ఉన్న ఆ ఇంటి పిల్లర్లను కూలగొట్టారు. ఈ విషయంపై శంకరయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఆయనపై ఆయన కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసు పెట్టారన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ జరిపి శంకరయ్యకు న్యాయం



మాట్లాడుతున్న భీమానాయక్

చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మంగీలాల్, ధరంసోత్ బాలు, శ్రీను, తిరుపతి, కండె శంకరయ్య, నీలం కిషన్, నరేశ్, విజేందర్, రాము, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

తొర్రూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలు పంచారామాల దర్శనం కోసం తొర్రూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను దర్శించుకునేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతామని, ప్రతీ ఆదివారం సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయని, ఒక్కొక్కరికి రూ.2,200 టికెట్ నిర్ణయించామని, వీటితో పాటు అరుణాచలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, సిరిపురం, అరుణాచలం, జోగులాంబ ఆలయం, బీచుపల్లి ఆంజనేయస్వామి దేవాలయాలకు నవంబర్ 3వ తేదీన బస్సు బయలుదేరుతుందని తిరిగి 6వ తేదీన తొర్రూరు చేరుకుంటుందన్నారు. టికెట్‌లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు ఫోన్:8074474984, 9959226053 నంబరులో సంప్రదించాలన్నారు.

అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

తొర్రూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గునిగంటి రాజన్న, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్ అన్నారు. మంగళవారం తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న 284 ఇండ్ల పంపిణీ చేపట్టాలని గత కొంత కాలంగా ధర్నా, రాస్తారోకో, నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం సరికాదన్నారు. గత ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేయకుండా వదిలేసిందని, ఆ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి రెండేళ్లు అవుతున్నా ఇళ్ల పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అధికారులు నిరుపేదలను గుర్తించి అర్హులైన వారందరికీ ఇళ్ల పంపిణీ చేపట్టాలని, ఇండ్లలో ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఐక్య ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎమ్డీ.యాకూబ్, దర్గయ్య, అమీర్, శోభ, వరలక్ష్మి, మల్లయ్య, సాయిలు తదితరులు ఉన్నారు.

అర్హులకే లేబర్ కార్డులు వర్తించాలి



మాట్లాడుతున్న కొండ ఉప్పలయ్య

మరిపెడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులకే లేబర్ కార్డులను వర్తింప చేయాలని బిల్డింగ్ అదర్స్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మరిపెడ మండల అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కొందరు అనర్హులు ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాల ద్వారా తప్పుడు ధృవ పత్రాలు పెట్టి లేబర్ కార్డుల కోసం దరఖాస్తులు చేస్తున్నారని, ఆ దరఖాస్తులను కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘ నాయకులు యాదగిరి, వెంకన్న, ముత్తయ్య, రామన్న తదితరులు పాల్గొన్నారు.

కిరాణాషాపులో చోరీ

- సీసీ పుటేజీలో ముగ్గురు ఆగంతకులు
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- కేసముద్రం మండలకేంద్రంలో ఘటన



కిరాణాషాపులో సీసీ పుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు, రికార్డులో కనిపిస్తున్న నిందితుడు

కేసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మార్కెట్‌రోడ్‌లోని మాచాముండ హోల్ సేల్ కిరాణం షాపులో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి సుమారు రూ.1లక్ష విలువైన సొత్తు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పేరాజారాం మంగళవారం తెలిపారు. బాధితుడు, పోలీసులు తెలిపిన ప్రకారం...కొద్దినెలల క్రితం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన పేరాజారాం ఇక్కడికి వలస వచ్చి మార్కెట్‌రోడ్‌లో కిరాణం హోల్‌సేల్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి ఒకరు తొలుత షాపు వెనుకవైపునున్న తలుపు గొళ్లాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. ఆ తర్వాత ముందువైపు ఉన్న తలుపునకు లోపలి వైపు ఉన్న తాళాన్ని పగులగొట్టి తలుపు తెరవడంతో ముందువైపు నుంచి మరో ఇద్దరు అగంతకులు లోపలికి ప్రవేశించారు. ముగ్గురు వ్యక్తులు వేగంగా కదులుతూ ఇతర సామగ్రిని వేటిని ముట్టుకోకుండా తమకు కావాల్సిన రెండు పెట్టెల్లోని సిగరెట్లను, ఒక డబ్బాలోని రూ.5ల కాయిన్లను ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ1లక్ష ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వివరించారు. తొలుత అందుబాటులో ఉన్న రెండు సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం, చిన్న ఇనుపరాడ్‌తో తాళాలను క్షణాల్లో తెరవడం చూస్తే దొంగతనంలో అనుభవం ఉన్న వ్యక్తులేనని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ షాపులో మరో కెమెరా ఉన్నట్లు అగంతకులు గుర్తించకపోవడంతో దాన్ని ధ్వంసం చేయలేదు. దీంతో చోరీ తతంగం అంతా ఆ కెమెరా ద్వారా రికార్డు అయింది. సీసీ పుటేజి, ఇతర క్లూస్ సేకరించి నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బయ్యారంలో ఉద్రిక్తత

ఇరువర్గాల మధ్య ఘర్షణ ● లాఠీ ఝులిపించిన పోలీసులు

బయ్యారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ వేళ మునుపెన్నడూ లేని రీతిలో సినీ ఫక్కీ తరహాలో బయ్యారంలో సోమవారం అలజడి నెలకొంది. నిమిషాల వ్యవధిలో భారీ సంఖ్యలో జనం గుమిగూడగా అక్కడికి చేరుకున్న పోలీసులు నివారణ చర్యల్లో భాగంగా లాఠీకి పనిచెబుతూ అలజడికారులను చెదరగొట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ రెండు గ్రామాలకు చెందిన ఇరు వర్గీయుల నడుమ తొలుత వివాదం నెలకొంది. చిలికి చిలికి గాలివానగా మారిన వివాదం తారాస్థాయికి చేరడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒకరిపై ఒకరు దూషించుకుంటూ దాడికి పాల్పడే స్థాయికి చేరడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న పోలీసులు నివారణ చర్యల్లో భాగంగా అలజడికారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే కొందరు దురుసుగా ప్రవర్తించడంతో ఓ కానిస్టేబుల్ అలజడికారులపై లాఠీ ఝులిపించారు. అనంతరం అక్కడికి చేరుకున్న బయ్యారం సీఐ రవికుమార్ ఉద్రిక్త పరిస్థితిని అదుపు చేసేందుకు పలు చర్యలు చేపట్టగా అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తు



ఆందోళనకారులను చెదరగొడుతున్న కానిస్టేబుల్

న్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా.. బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో సోమవారం జరిగిన ఘటన తమ దృష్టికి వచ్చిందన్నారు. పోలీసుల పట్ల పలు వురు దురుసుగా ప్రవర్తిస్తూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనేలా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో పరిస్థితిని అదుపుచేసేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా తమ సిబ్బంది లాఠీతో అలజడికారులను చెదరగొట్టాల్సి వచ్చిందన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతుందని పేర్కొన్న ఎస్సై శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తించిన వారిపై త్వరలోనే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



విద్యుదాఘాతంతో దగ్ధమైన మొబైల్ షాపు

మొబైల్ షాపులో షార్ట్ సర్క్యూట్

రెండు లక్షల నగదు, రూ.9 లక్షల ఫోన్లు, ఫర్నిచర్ దగ్ధం

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో ఓ మొబైల్ సెంటర్‌లో షాట్ సర్క్యూట్‌తో సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రూ. 2 లక్షల నగదుతో పాటు రూ. 9 లక్షల విలువైన కొత్త సెల్ ఫోన్లు, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో తంగిళ్లపల్లి శ్రీధర్ అనే వ్యక్తి కొంతకాలంగా మణి మొబైల్ దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు సోమవారం రాత్రి ఎనిమిది గంటలకే నిర్వాహకుడు మొబైల్ షాపు బంద్ చేసి ఇంటికెళ్లినట్లు తెలిపారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో మొబైల్ షాపులో ప్రమాద వశాత్తు విద్యుదాఘాతం ఏర్పడి తీవ్ర మంటలు చెలరేగాయని తెలిపారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేసుకున్న పోలీసులు, అగ్నిమాపక బృందం గంట పాటు శ్రమించి మంటలు ఆర్పినట్లు తెలిపారు.

ఈ సంఘటనలో షాపులో ఉన్న రూ. 2 లక్షల నగదు, రూ. 9 లక్షల విలువైన కొత్త సెల్ ఫోన్‌లు, ఇతర సామగ్రి పూర్తి దగ్ధమైనట్లు తెలిపారు. షాపు నిర్వాహకుడు టి శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ జి.మహేందర్‌రెడ్డి తెలిపారు.

బయ్యారంలో ఎమ్మెల్యే పర్యటన



అంగన్‌వాడి భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం బయ్యారం మండలంలో పర్యటించారు. తొలుత నామాలపాడు గ్రామపంచాయతీలో 33/11 కేవీ విద్యుత్ లైన్‌కు శ్రీకారం చుట్టారు. తదనంతరం కొత్తపేట, గంధంపల్లి, బాలాజీపేట గ్రామాలలో నూతన అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. అదే విధంగా బయ్యారం, జగ్గతండా, వెంకట్రాంపురం గ్రామాలలో సైడ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ నాయక్, రాము నాయక్, లక్ష్మీ, వెంకటపతి, నాగరాజు, ఉపేందర్, పాల్గొన్నారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

బయ్యారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని బెదిరించి దాడికి పాల్పడిన ఘటనలో మంగళవారం కేసు నమోదు చేసినట్లు బయ్యారం ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బయ్యారం గ్రామానికి చెందిన జి.సాయి స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఓ పానిపూరీ సెంటర్ వద్ద గప్‌చిప్ తింటున్నాడు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన మహబూబాబాద్‌కు చెందిన డి.సాయితో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే మహబూబాబాద్ నుంచి డి.సాయితో వచ్చిన నలుగురు వ్యక్తులు బయ్యారానికి చెందిన జి.సాయిపై దాడి చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీనిపై బయ్యారానికి చెందిన జి.సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహబూ బాబాద్‌కు చెందిన డి.సాయితో పాటు మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

కన్నాయిగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సర్వాయి పంచాయతీ పరిధి చిట్యాల గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి చెందింది. గ్రామానికి చెందిన బొచ్చు సింధూజ (17) ములుగు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. దసరా సెలవులకు ఇం టికి వచ్చిన ఆమె జ్వరం బారిన పడింది. దీంతో అదే గ్రామానికి చెందిన సమీప బంధువు ద్విచక్ర వాహనంపై తన చెల్లితో కలిసి కన్నాయిగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రికి బయల్దేరింది. ఈ క్రమంలో మార్గ మధ్యలో ఎదురుగా వస్తున్న కారు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది.

దీంతో తీవ్రంగా గాయపడిన సింధూజ అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్పంగా గాయా లయ్యాయి. మృతురాలి తల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యతో పాటు మానసిక ఆరోగ్యం

- నిట్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు
- విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ
- హార్ట్‌ఫుల్‌నెస్, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో ఎంవోయూ
- మానసిక ఆరోగ్య శిక్షణలో నిట్‌కు జాతీయ గుర్తింపు

హనుమకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (నిట్) విద్యార్థులు, అధ్యాపకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మానసిక ఆరోగ్యం, భావోద్వేగ స్థిరత్వం, సమగ్ర విద్యను ప్రోత్సహించే దిశగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యతో పాటు మానసిక ఆరోగ్యం పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోంది. సాధారణంగా ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకే ప్రాధాన్యం ఇస్తారు. ప్రామాణికమైన విద్యను అందించడంపైనే ప్రధానంగా దృష్టి పెడతారు. విద్యార్థులు, అధ్యాపకుల ఒత్తిడి, వారి మానసిక స్థితిగతులను పెద్దగా పట్టించుకోవు. కానీ వరంగల్ నిట్ ఇందుకు భిన్నంగా ఒక పక్క ప్రపంచస్థాయి ఉన్నత విద్యాప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూనే సమాజానికి మానసికంగా స్థిరత్వం, ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కొగలిగే స్థితప్రజ్ఞత, ధైర్యవంతులైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు మరోపక్క ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే నిట్ క్యాంపస్‌లో మానసిక ఆరోగ్య వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. కళాశాల వినూత్న కార్యక్రమాల్లో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు.


జ్యోతి ప్రజ్వలన చేసి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, తదితరులు

ఆరోగ్యకరమైన వాతావరణం

విద్యార్థులు, అధ్యాపకులకు ఆత్మీయ, మానసిక సమతుల్య వాతావరణాన్ని కల్పించడం ఈ కేంద్ర ప్రధాన లక్ష్యం. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020లో పేర్కొన్న మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ఒక ప్రధాన అంశాన్ని ఆచరణాత్మకం చేసేందుకు దీనిని ఏర్పాటు చేశారు. ఈ మానసిక ఆరోగ్యం, వెల్‌నెస్ సెంటర్‌కు గత సంవత్సరం ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్ (కన్హా శాంతి వనం)తో ఎంవోయూ కుదుర్చుకోవడంతోనే అంకురార్పణ జరిగింది. హార్ట్‌ఫుల్‌నెస్ పక్షాన ఈ ఒప్పందంపై రిటైర్డ్ డీజీపీ ఆదిత్య ఆర్య, డాక్టర్ అనంత మాధవ మోహన్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ధ్యానం, యోగాభ్యాసం, మానసిక ఒత్తిడి నియంత్రణ వంటి పద్ధతులను విద్యార్థులు, అధ్యాపకులు తమ దైనందిన జీవితంలో ఆచరించేట్లు చేయడం ఈ సెంటర్ ముఖ్య ఉద్దేశం.

జాతీయ గుర్తింపు

నిట్ వెల్‌నెస్ సెంటర్ మానోసిక ఆరోగ్యం, భావోద్వేగాల నియంత్రణపై ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలకు జాతీయ గుర్తింపు లభించింది. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ నిర్వహించిన తొలి జాతీయ వెల్‌బీయింగ్ కాంక్లేవ్‌లో వరంగల్ నిట్ తన కార్యక్రమాలను ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఉన్నత విద్యా కార్యదర్శి సంజయ్ మూర్తి, విద్యా మంత్రిత్వశాఖ అధికారులు ఈ కార్యక్రమాలపై ప్రశంసలు కురిపించారు.

ధ్యానం, ఒత్తిడి నివారణలో శిక్షణ

ఈ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటైన తర్వాత విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక ఆరోగ్యాన్ని పెంచడానికి పలు ముఖ్యమైన కార్యక్రమాలు చేపట్టింది. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌తో కలిసి సుదర్శన క్రియ, మైండ్‌ఫుల్‌నెస్‌లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. అధ్యాపకుల కోసం ప్రత్యేకంగా బేర్‌ఫుట్ కౌన్సెలింగ్ వర్క్‌షాపు నిర్వహించింది. ఇందులో విద్యార్థులతో పాటు నిట్‌లో పని చేస్తున్న 150 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఎక్స్‌ప్రెషన్ ఇండియా సంస్థ డైరెక్టర్ జితేంద్ర నాగపాల్, డాక్టర్ గీతా మెహ్రోత్ర పాల్గొని భావోద్వేగ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు.

వెల్‌నెస్ కార్యకలాపాలు

నిట్ క్యాంపస్‌లో మానసిక ఆరోగ్య వెల్‌నెస్ సెంటర్ విద్యార్థులు, అధ్యాపకుల కోసం ప్రతి వారం ధ్యానం, యోగ అభ్యాసాలపై ఇస్తున్న శిక్షణకు మంచి స్పందన లభిస్తోంది. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. నిరంతరం మానసిక ఆరోగ్య శిక్షణా కార్యక్రమాలను కొనసాగించేందుకు వీలుగా వరంగల్ నిట్ 67వ వ్యవస్థాపక దినోత్సవం, ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10వ తేదీన వెల్‌నెస్ సెంటర్‌కు ప్రత్యేక హాల్‌ను కేటాయించారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి ఈ హాల్‌ను ప్రారంభించారు. ఈ యేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఇతివృత్తం 'సంక్షోభాలు, అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యం- వివిధ సేవా రంగాల్లో అందుబాటు'. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ మెడికోవర్ ఆస్పత్రి డాక్టర్ ప్రియాంక మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. హైదరాబాద్ హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులు కూడా పాల్గొని ధ్యానంపై మార్గదర్శనం చేశారు. ఈ మానసిక శిక్షణా కార్యక్రమాలను కొనసాగించేందుకు ఈ యేడు మే 5న హార్ట్‌ఫుల్‌నెస్‌తో ఉన్న ఎంవోయూను మరో మూడేళ్లు నిట్ పొడిగించుకున్నది.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం

మానసిక ఆరోగ్యం అనేది నేర్చుకునే ప్రక్రియ మాత్రమే కాదు. జీవన గమనంలోనూ కీలకమైంది. ఈ కేంద్రం ద్వారా కరుణ, సమతుల్యత, ధైర్యం, మానసిక స్థితప్రజ్ఞత కలిగిన విద్యార్థులను సమాజానికి అందించాలన్నది మా లక్ష్యం. వరంగల్ నిట్ తన విశిష్టమైన కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ విద్యా వ్యవస్థలో సమగ్ర దృక్పథాన్ని తీసుకువస్తున్న అత్యున్నత విద్యా సంస్థగా నిలుస్తోంది.

నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి


సీతంపేటలో రేగడి మట్టిని సేకరిస్తున్న నేతకాని కులస్థులు

'దీపావళి బతుకమ్మ' షురూ

సీతంపేటలో నేడు జోడెద్దుల విగ్రహ ప్రతిమల నిమజ్జనం

హసన్‌పర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటలో దీపావళి అమావాస్య రోజు నుంచి మూడు రోజుల పాటు సాగే నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వారం నుంచే వివిధ రాష్ట్రాలలో స్థిరపడిన నేతకాని కులస్తులు, వారి కుటుంబ సభ్యులు సీతంపేటకు చేరుకోవడంతో సీతంపేటలో పండుగ వాతావరణం నెలకొంది. వేడుకల్లో మొదటి రోజు మంగళవారం ఉదయమే నేతకాని కులస్తులు ఉపవాస దీక్షతో ఊరు శివారులోని కుంటకు చేరుకొని రేగడి మట్టిని సేకరించి జోడెద్దుల విగ్రహ ప్రతిమలను తయారు చేశారు. పిండి వంటలతో జోడెద్దుల విగ్రహ ప్రతిమలకు నగలు అలంకరించి కేదారీశ్వరస్వామి వ్రతం ఉపవాసదీక్షతో నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా ఉండాలని కుటుంబ సభ్యులంతా ఆయురారోగ్యాలతో ఐష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని వేడుకున్నారు. దీంతో నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి.

ఊరేగింపు.. నిమజ్జనం..

సీతంపేటలో రెండో రోజు నేతకాని కులస్తుల దీపావళి వేడుకలలో భాగంగా బుధవారం కేదారీశ్వరస్వామి వ్రతం ముందు రేగడి మట్టితో తయారు చేసిన జోడెద్దుల విగ్రహ ప్రతిమలకు ప్రత్యేకంగా పిండి వంటలతో తయారు చేసిన (వ్యవసాయ పనిముట్లు నాగళి, కోల, కర్రు) నగలను అలంకరించి కోలాటాలతో ఆటపాటలతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకొని నిమజ్జనం చేస్తారు. ఇది కేవలం పురుషులు మాత్రమే జరుపుకునే రెండో రోజు ఘట్టం.


మహానంది పురస్కారాన్ని అందుకుంటున్న గంగు ఉపేంద్రశర్మ

మహానంది అవార్డుల ప్రదానోత్సవం

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోజా క్రియేషన్స్ 30వ వార్షికోత్సవాల సందర్భంగా దీపావళి పర్వదిన వేళ హనుమకొండ చౌరస్తాలోని వీనస్ ఫంక్షన్ హాల్‌లో వివిధ రంగాల ప్రముఖులకు కాకతీయ మహానంది పురస్కారాలను ప్రదానం చేసింది. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో విశిష్ఠ అతిథిగా పాల్గొన్న ప్రముఖ సంగీతకారుడు, కర్నాటక గాత్ర విద్వాంసుడు ఆచార్య తిరుపతయ్య మాట్లాడుతూ.. సకల కళల సమాహారంగా ఓరుగల్లు విరాజిల్లుతున్నదన్నారు. రోజా క్రియేషన్స్ డైరెక్టర్ ఆలేటి శ్యాం సుందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకుడు గట్టు మహేశ్‌బాబు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా అనేక వైవిధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న రోజా క్రియేషన్స్‌ను అభినందించారు.

కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మను ఘనంగా సత్కరించి అర్చక రత్న బిరుదుతో కాకతీయ మహానంది పురస్కారాన్ని అందజేశారు. అదే విధంగా ప్రముఖ కవిగా, లయనిజం ద్వారా సామాజిక సేవ చేస్తున్న పొట్లపల్లి శ్రీనివాసరావు, ఓరుగల్లుకు సంగీత పరిజ్ఞానం నేర్పిన ప్రముఖ సంగీత విద్వాంసుడు సీతాల రఘువేందర్, రంగస్థల నటుడు, కళాపోషకుడు, కళా రాజేశ్వర్‌రావు, ప్రముఖ ఫొటోగ్రాఫర్, లయన్ వంగరి వేణుగోపాల్, ప్రముఖ అధ్యాపకురాలు ఎం.రాంబాయి, కొప్పుల రాకేశ్, ఉప్పనపల్లి రవికుమార్, బి.లక్ష్మీబాయి తదితరులకు కాకతీయ మహానంది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాల య జానపద గిరిజన విజ్ఞాన పీఠం డీన్ గడ్డం వెంకన్న, పోలీసు అధికారి రావెళ్ల రామారావు, ప్రముఖ వ్యాపారి పుల్లూరు మధు, వేణుమాధవ్, ప్రముఖకవి పిట్టవరం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రముఖ వ్యాఖ్యాత గాయకుడు రయ్యాల శ్రీధరాచారి స్వాగతం పలికారు.

మందులోళ్లా.. మాయలోళ్లా?

- నిబంధనలను ఉల్లంఘిస్తున్న మెడికల్ షాపుల నిర్వాహకులు
- యథేచ్ఛగా యాంటీ బయాటిక్స్, అన్‌వాంటెడ్ కిట్ల అమ్మకాలు
- మందులపై జీఎస్టీ తగ్గినా అమలు కాని వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



పోచమ్మమైదాన్ (వరంగల్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపుల మాయాజాలం కొనసాగుతోంది. అడిగేవారు, ఆపేవారు లేకపోవడంతో షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన రెచ్చిపోతున్నారు. ప్రజలకు నాసిరకం మందులు అంటగడుతూ బిల్లులు లేకుండా రూ.కోట్లలో వ్యాపారం కొనసాగిస్తున్నారు. అనేక మంది మెడికల్ షాపుల నిర్వాహకులు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. జ్వరం, జలుబు, దగ్గు తదితర జబ్బులకు విచ్చల విడిగా యాంటీబయాటిక్స్ అమ్ముతున్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మేవారు కొందరైతే, ప్రిస్క్రిప్షన్ పట్టుకొని వెళ్తే నాసిరకమైన మందులు అంటగట్టేవారు మరికొందరు. సేమ్ మందులు కాదుకదా అని ఎవరైనా ప్రశ్నిస్తే కేవలం కంపెనీ మాత్రమే తేడా, ఫార్ములా ఒక్కటే అని బుకాయిస్తున్నారు. నగర పరిధిలోనే సుమారు 1500 వరకు, జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల వరకు మెడికల్ షాపులు కొనసాగుతున్నాయి.

సుమారు 80 శాతానికి పైగా మెడికల్ షాపులలో ఫార్మసిస్టులే ఉండరు. కేవలం వారి సర్టిఫికెట్ పెట్టి మెడికల్ షాపుల అనుమతి పొంది పదో తరగతి చదివిన వారు మెడికల్ షాపులు నిర్వహిస్తున్నవారు కోకొల్లలు. అంతేకాక అనేక చోట్ల ఇష్టారీతిన యాంటీబయాటిక్స్, అన్‌వాంటెడ్ కిట్లు, స్టెరాయిడ్స్, పలురకాల సిరప్‌లు, మత్తు ఇంజక్షన్లు, ఇతర మందుల అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి.

అనేక చోట్ల మందులకు బిల్లులు ఇవ్వకుండా జీరో దందాలకు పాల్పడుతున్నారు. మందులు కొనుగోలు చేసిన వారి వద్ద డబ్బులు తీసుకోవడం తప్ప.. బిల్లు ఇవ్వడం అనేదే కనిపించడం లేదు. అధిక లాభాలకు ఆశపడి నాసిరకమైన మందులను అంటగట్టడమే ఇందుకు కారణమని పలువురు చెబుతున్నారు. యేటా రూ.కోట్లలో జీరో దందా కొనసాగుతోంది. అంతేకాక కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జీఎస్టీని సైతం అమలు చేయడం లేదు. పాత ధరలకే మందులు అమ్ముతున్నారు.

అధికారులెక్కడ ?

మెడికల్ మాఫియా ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు.ఔషధ నియంత్రణశాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వెలువడుతున్నాయి. పైగా మెడికల్ వ్యాపారానికి వారే అండగా ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. మెడికల్ షాపులలో కనీసం ఫార్మసిస్టులు లేకపోవడం కనబడటం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా డ్రగ్ కంట్రోల్ అధికారులు మేలుకొని మెడికల్ మాఫియాను అరికట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

విచ్చలవిడిగా దోపిడీ..

ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల మెడికల్ షాపుల హవా జిల్లాలో కొనసాగుతోంది. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో సైతం కార్పొరేట్ కంపెనీలు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నాయి. గల్లీకి ఒక షాపు చొప్పున అనేక చోట్ల వీరి దందా కొనసాగుతోంది. అందులో సొంత కంపెనీల మందులే రోగులకు అంటగడుతున్నట్లు విమర్శలు వెలువడుతున్నాయి. అంతేకాక పలు చోట్ల జనరిక్ మందులను సైతం బ్రాండెడ్ పేరుతో అమ్మకాలు సాగిస్తున్నారని, ఇందుకోసం డిస్కౌంట్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని తెలుస్తోంది.

సురేఖ మంత్రి పదవిపై

'కడియం' కుట్ర

- మాజీ ఉప ముఖ్యమంత్రి టి. రాజయ్య


మీడియాతో మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

హనుమకొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండా సురేఖ మంత్రి పదవిపై కడియం శ్రీహరి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఆరోపించారు. మంత్రి పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో శ్రీహరి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. సోమవారం హనుమకొండలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. రాష్ట్రంలో మంత్రి పదవుల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య గొడవలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ రెడ్డి నాయకులంతా కలిసి ఒక బీసీ మహిళ మంత్రి కొండా సురేఖపై కుట్రలు చేయడం దారుణమన్నారు. రెడ్డి నాయకులతో కలిసి మంత్రి పదవిని చేజిక్కించుకోవాలని కడియం శ్రీహరి ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కడియం శ్రీహరి గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోసి పార్టీని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్లారని రూ.3లక్షల కోట్లు అప్పులు చేసి ఒక కొత్త ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునితగోపీనాథ్ భారీ మెజార్టీతో గెలుస్తుందని, రాష్ట్రంలో నిజమైన మార్పు జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం అవుతుందని రాజయ్య తెలిపారు.

ఉర్సు దర్గా వద్ద ఫూలే విగ్రహం ధ్వంసం

మద్యం మత్తులో ఓ వ్యక్తి దుశ్చర్య

కరీమాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉర్సు దర్గా వద్ద బీసీల ఆరాధ్య దైవమైన మహాత్మజ్యోతిరావు ఫూలే విగ్రహాన్ని ఓ దుండగుడు ధ్వంసం చేశాడు. మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు సోమవారం అర్ధరాత్రి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన వంగరి రాహుల్‌గా నిర్ధారించారు. కాగా ఈ ఘటనపై పలువురు బీసీ సంఘాలు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ డిమాండ్ చేశారు. బీసీల స్ఫూర్తి ప్రదాత అయిన ఫూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని అన్నారు. ఇది హేయమైన చర్య అని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు డిమాండ్ చేశారు.

సొంత ఖర్చుతో మళ్లీ ఏర్పాటు చేయిస్తా : నన్నపునేని

ఉర్సు దర్గా వద్ద మహాత్మ జ్యోతిరావు ఫూలే విగ్రహం ధ్వసం కావడం బాధాకరమని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం ఆయన సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అదే స్థలంలో సొంత ఖర్చులతో జ్యోతిరావు ఫూలేతో పాటు, సావిత్రీబా ఫూలే కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.


ధ్వంసమైన జ్యోతిబా ఫూలే విగ్రహం

చిగురిస్తున్న ఆశలు

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఇందులో మొదటి దశలో 1,738 ఎకరాలు, రెండో దశలో 6,075 ఎకరాల భూమి అవసరం కాగా, పూర్తిస్థాయిలో భూసేకరణ చేశారు. ఈ రెండు దశల నుంచి ఎత్తిపోతలు జరుగుతున్నాయి. అయితే భూ చిక్కులన్నీ కూడా మూడో దశలో ఎదురవుతున్నాయి. ప్రాజెక్టులో కీలకమైన మూడో దశ నుంచే అత్యధికంగా 2,39,790 ఎకరాలకు సాగు నీరు అందనుంది. ఇప్పటికే దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌లోకి దేవాదుల నుంచి లిఫ్టుల ద్వారా గోదావరి జలాలు చేరుతున్నాయి. ఈ సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న వెల్‌టైప్‌లో నిర్మించగా, 141 మీటర్ల లోతులో పంపుహౌస్ ఏర్పాటు చేశారు.

ఇక్కడి నుంచే ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీటిని లిఫ్టుచేసి ఎగువన ఉన్న జిల్లాలకు గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. అయితే ఎంతో కీలకమైన ఈ దశలోనే భూసేకరణకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో రైతాంగానికి సాగునీరు అందటం లేదు. మొత్తం 33,451ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటి వరకు అధికారులు 30,582 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 2,869 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

ఇందులో ప్రధానంగా జనగామ జిల్లాలో 1,080, సిద్ధిపేట జిల్లాలో 935 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలో గల జనగామ నియోజకవర్గంలో 6,477 ఎకరాలకు గానూ, 5,492 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 985 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అలాగే స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో 8,035 ఎకరాలకు భూసేకరణకు 7,935 ఎకరాల భూమి సేకరించారు. ఇంకా 100 ఎకరాలు, పాలకుర్తి నియోజకవర్గంలో 4,706 ఎకరాలకు గానూ 3,939 ఎకరాల భూ సేకరణ చేయగా, ఇంకా 767 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. అలాగే వర్ధన్నపేటలో 168 ఎకరాలు, నర్సంపేట నియోజకవర్గంలో 133ఎకరాలు, భూపాలపల్లిలో 59ఎకరాలు, ములుగులో 179 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

భూ సేకరణపై ఇటీవల భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దేవాదుల, వరంగల్, హైదరాబాద్‌లో పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. దేవాదులను ప్రాధాన్యత ప్రాజెక్టుగా చేపట్టడంతోపాటు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, పనుల్లో జాప్యం జరగవద్దని ఆదేశించారు. దీంతో కెనాల్స్, పంపుహౌస్‌లు, మోటర్ల పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ, భూసేకరణపై అడుగులు పడటం లేదనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. భూసేకరణ పూర్తయితేనే చివరి ఆయకట్టు వరకు గోదావరి జలాలు అందించే వీలుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే భూసేకరణతో పాటు మూడో దశల్లో మొత్తం 2,430 కిలో మీటర్ల గ్రావిటీ కెనాల్స్ తవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 1,663.10 కిలో మీటర్లే పూర్తి చేశారు. ఇంకా 767కిలో మీటర్ల గ్రావిటీ కెనాల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అధికారులు కాలువల తవ్వకాలపై కూడా దృష్టి పెట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


నర్సంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో భోజనం, గుడ్డు వడ్డిస్తున్న వంట ఏజెన్సీ మహిళలు

వంట.. తంటా

కొండెక్కిన కోడిగుడ్ల ధర

- ఏజెన్సీలకు 7 నెలలుగా అందని రూ. కోటి 23 లక్షల బిల్లులు
- 1 నుంచి 8 తరగతి వరకు సెప్టెంబర్ భోజన బిల్లు పెండింగ్
- 9, 10 వ తరగతులకు విడుదల కాని 7 నెలల భోజన బిల్లులు
- అప్పులు తేలేక వంట ఏజెన్సీ కార్మికులకు తప్పని తిప్పలు

నర్సంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆకలి తీరుస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలకు సకాలంలో బిల్లులు అందడంలేదు. నెలనెలా అందాల్సిన బిల్లులను ఆరు, ఏడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో మహిళలు అప్పులు చేసి కోడి గుడ్లు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి వారానికి మూడు రోజులు భోజనంలో గుడ్డును పిల్లలకు పెడుతున్నారు. బిల్లులు సకాలంలో రాక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత కొన్ని నెలలుగా పెద్ద మొత్తంలో బిల్లుల బకాయిలు అందక వంటఏజెన్సీల నిర్వాహకులు అప్పులు తీర్చలేక పడరాని పాట్లు పడుతున్నారు. పెరిగిన ధరలతో మధ్యాహ్న భోజనం నిర్వహణ వారికి భారంగా మారుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన బిల్లులు విడుదల కాక మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు పడరానిపాట్లు పడుతున్నారు.

వరంగల్ జిల్లాలో 546 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 27,168 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలవుతుంది. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి భోజనం రూ.6.78, 6నుంచి 8వ తరగతి వరకు విద్యార్థికి రూ:10.17, 9, 10వ తరగతి విద్యార్థికి రూ:10.67 వంతున్న వంటఏజెన్సీ మహిళలకు చెల్లిస్తున్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు భోజన బిల్లులు ఆగస్టు వరకు ప్రభుత్వం చెల్లించారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9, 10 వతరగతి వరకు భోజన బిల్లులు మార్చి నుంచి పెండింగ్‌లో ఉండడంతో వంటఏజెన్సీ మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఒక్కో కోడిగుడ్డుకు రూ.6 వంతున గుడ్డు బిల్లు సపరేటుగా అందిస్తుంది. 1 నుంచి 8 వ తరగతి వరకు చదివే విద్యార్థులకు సంబంధించి మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలకు భోజన బిల్లులు ఆలస్యమైనా సక్రమంగా అందుతూ సెప్టెంబరు నెల బిల్లు మాత్రమే పెండింగ్ ఉంది. 9, 10 వతరగతి విద్యార్థులకు సంబంధించిన భోజన బిల్లులు మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎగ్ (కోడి గుడ్లు) బిల్లులు మాత్రం నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో వంటఏజెన్సీ మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు.

అందని బిల్లులు

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులకు మెనూ ప్రకారం వారంలో మూడు సార్లు కోడి గుడ్డును అందిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధరలు కొండెక్కాయి. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ:6 చెల్లిస్తుంది. మార్కెట్‌లో మాత్రం గుడ్డు ధర రూ.6 నుంచి రూ.7 ధర పలుకుతుంది. నిత్యావసర సరుకుల ధరలు సైతం పెరగడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో 546 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 27,168 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. గత మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలలకు సంబంధించిన జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని వంట ఏజెన్సీ మహిళలకు నెలకు సుమారు రూ.17లక్షల 60 వేల మేరకు ఎగ్ బిల్లులు అందిస్తుంటారు. గత మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలలకు సంబంధించిన ఎగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఏజెన్సీల మహిళలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

వైభవంగా వెలుగుల పండుగ

● ఇంటింటా ఆనందోత్సాహాలతో దీపావళి పర్వదినం ● భక్తి శ్రద్ధలతో గౌరీ కేదారేశ్వర వ్రతాలు ● ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన దుకాణాలు, ఈదుల పూసపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన దుకాణంలో బాణాసంచాలు కొనుగోలు చేసి పెద్దఎత్తున కాల్చారు. వ్యాపారులు సిరి సంపదలు కలగాలని ధనలక్ష్మికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, మరికొంత మంది కొత్త వ్యాపారాలకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యాం సుందర్‌శర్మ ఆయన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పర్వదినాన్ని పురస్కరించు కొని లక్ష్మీపూజ నిర్వహించారు. కాగా మానుకోట పట్టణం ఈ రెండు రోజుల్లో రాత్రివేళల్లో అర్ధరాత్రి వరకు టపాసుల మోతలు దద్దరిల్లాయి.

వివిధ మండలాల్లో...

● మరిపెడ మండలంలోని వివిధ గ్రామాల్లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బాణా సంచాలు కాల్చారు. అనంతరం కేదారీశ్వర వ్రతాన్ని జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు-మంజుల. రామడుగే అచ్చుత్‌రావు, జర్పుల కాలు నాయక్, నారెడ్డి సుదర్శన్‌రెడ్డి-కవిత పాల్గొన్నారు.

● కురవి, సీరోలు మండలాల్లో ప్రజలు దీపావళి పండుగను ఆనం దోత్సవాలతో జరుపుకున్నారు. మహిళలు దీపాలతో ఇళ్లను అలం కరించగా యువకులు బాణా సంచాలు పేల్చి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీపావళి పడుగను పురస్కరించుకొని కురవి శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నా రు. భక్తులు వాహన పూజలు నిర్వహిం చారు. లక్ష్మీదేవికి అర్చనలు చేశారు. టపాసులు పెద్ద ఎత్తున పేల్చి కేరింతలు కొట్టారు.

● డోర్నకల్ మండల వ్యాప్తంగా దీపావళి వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మునిసిపల్ కేంద్రంలో వ్యాపారస్థులు షాపుల్లో లక్ష్మీపూజ నిర్వహించిన అనంతరం బంధుమిత్రులకు మితా యి లు అందజేసి బాణా సంచాలు కాలుస్తూ వేడు కలు జరుపుకున్నారు.

● కొత్తగూడ మండలంలో దీపావళి పండగను ఆనందంగా జరుపుకున్నారు. ఇండ్లలో లక్ష్మీ పూజ నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేసుకుంటూ బాణాసంచా కాలుస్తూ ఆనందంగా గడిపారు.

● నెల్లికుదురు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో దీపావళి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో కేదారేశ్వర నోము లు, లక్ష్మీపూజ జరుపుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. టపాసులు పెద్ద ఎత్తున పేల్చారు.



దీపావళి వేడుకల్లో పాల్గొన్న మార్వాడీలు



బీజేపీ నేత శ్యాం సుందర్‌శర్మ నివాసంలో లక్ష్మీపూజలో పాల్గొన్న కుటుంబ సభ్యులు



కొత్తగూడ మండలం వేలుబెల్లిలో క్రాకర్స్ కాలుస్తున్న చిన్నారులు

మొక్కజొన్నకు రూ.3వేలు చెల్లించాలి

కేసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.3వేలు, పత్తికి రూ.10వేలు ఇవ్వాలని అఖిలభారత ఐక్య రైతు సంగం జిల్లా ప్రధానకార్యదర్శి ఆవుల కట్టయ్య డిమాండ్ చేశారు. కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరలు చెల్లించాలనే డిమాండ్‌తో ఈనెల 23న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు రైతాంగం పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఆయన వెంట డివిజన్ అధ్యక్షుడు బొమ్మగాని ఎల్లయ్య, పెరుమాళ్ల జానకీరామయ్య, పుల్లయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఆవుల కట్టయ్య

యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

డోర్నకల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : యు వకులు చెడు వ్యసనాల భారిన పడకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచు కోవాలని ఎన్‌కే ఆగ్రోస్ పీఆర్‌వో శివ ప్రసాద్ అన్నారు. మంగళవారం డోర్నకల్ మండలం తొడేళ్ల గూడెంలో యువకులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొడేళ్లగూడెంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని స్థానిక యువకులు కోరగా సానుకూలంగా స్పందించారు. అనంతరం క్రికెట్ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి ఫ్రెండ్స్ యూత్, ద్వితీయ బహుమతి కుంట కింగ్స్ సాధించారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, రన్నరప్‌కు రూ.5 వేల నగదును అందించారు. తాళ్లూరి సతీష్, వెంకట్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శివప్రసాద్

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి..

(5వ పేజీ తరువాయి)

భారత జవానులు లడక్ ప్రాంతం హాట్ స్రింగ్ వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో చైనా ఆర్మీ ఇండియన్ ఆర్మీపై దొంగ దాడి చేసిన ఘటనలో 10 మంది భారత జవాన్‌లు హతమయ్యారని ఆరోజు నుంచి అక్టోబరు 21న దేశ వ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాదిలో దేశవ్యాపంగా 191 మంది జవాన్లు విధి నిర్వహణలో అమరులు కాగా, మన రాష్ట్రంలో 5 మంది వీర మరణం చెందినట్లు తెలిపారు. అమరుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు ఆర్థికంగా అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తుందన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీసు వ్యవస్థ అన్ని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల పరి రక్షణ, సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మారకద్రవ్యాల నిర్మూలనలో పోలీసు వ్యవస్థ కీలకంగా మారిందన్నారు. అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. డీఎస్పీలు తిరుపతిరావు, క్రిష్ణకిషోర్, గంద్రతి మోహన్, శ్రీనివాస్, సీఐలు పాల్గొన్నారు.

నర్సింహులపేటలో కొవ్వత్తుల ర్యాలీ



నర్సింహులపేటలో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై సురేష్

నర్సింహులపేట(మహబూబాబాద్ క్రైం) నర్సింహులపేట మండల కేంద్రంలో ఎస్సై మాలోతు సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తా నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకన్న, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి

● జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్ బాటలో పయనించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. మహబూబాబాద్‌లో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో 82వ రాష్ట్రీయ ఆజాద్ హింద్ ఫౌజ్ దివాస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతాజీ విగ్రహం వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు ఆజాద్ హింద్ ఫౌజ్ దివాస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 21 అక్టోబరు 1943లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించి ఆజాద్ హింద్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సింగపూర్‌లో జెండాను ఆవిష్కరించారని చెప్పారు. ఆయన ఏర్పాటు చేసిన ప్రభుత్వాన్ని జర్మనీ, జపాన్ సహా పది దేశాలు అధికారికంగా గుర్తించాయని చెప్పారు. ఇది భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో గర్వించదగ్గ ఘట్టమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, వివేక్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రఘు, విశ్వనాధం, సుందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, వెంకటస్వామి, నరేష్, వెంకన్న, ప్రజ్వల్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో నేతాజీ విగ్రహం వద్ద ఆజాద్ హింద్ ఫౌజ్ దివస్ జెండాను ఆవిష్కరిస్తున్న శంతన్ రామారాజు

మత్స్యకార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కురవి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కార్యదర్శి పిట్టల వెంకన్న డిమాండ్ చేశారు. మత్స్యకార్మిక సంఘం ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కురవి మండలం బలపాలలో సంఘ పతకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు కావోస్తున్నప్పటికి ఉచిత చేపపిల్లలు సరఫరా చేయలేదని, సొసైటీలకు నగదు, మత్స్యకార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు దర్గయ్య, పిట్టల మోహన్‌రావు, గోనెల గోపయ్య, గావటి సైదులు, పిడుగు నాగులు, పిట్టల ఉపేందర్, నక్క వెంకన్న, ఉప్పలయ్య, లాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి పిట్టల వెంకన్న

కల్లుగీత కార్మిక సంఘం మండల నూతన కార్యవర్గం

నర్సింహులపేట(మహబూబాబాద్ క్రైం) అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):

కల్లుగీత కార్మిక సంఘం నర్సింహులపేట మండలం నూతన కార్యవర్గంను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా కొమ్ములవంచ గ్రామానికి చెందిన డొనికని రామన్న, ప్రధాన కార్యదర్శిగా పడమటిగూడెంకు చెందిన చిం్ర సతీష్, ఉపాధ్యక్షులుగా రామన్నగూడెంకు చెందిన గుండగాని వెంకన్న, కాశాధికారిగా ముంగి మడుగు గ్రామానికి చెందిన దొంతు రామూర్తి, సహాయ కార్యదర్శిగా సీహెచ్ వెంకన్న, గౌరవ అధ్యక్షులుగా చలమల్ల యాదగిరి, సోషల్ మీడియా కన్వీనర్ గా కోల యాకయ్యల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కల్లు గీత కార్మికుల సమస్యలపై పోరాడుతామని ఈ సందర్భంగా ఎన్నికైన వారు తెలిపారు.



కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు రామన్న, ప్రధాన కార్యదర్శి సతీష్

వాహనాల చోరీ నిందితుల అరెస్ట్

గీసుగొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలలోని జాన్‌పాక వద్ద గత వారం రోజుల కిందట జరిగిన వాహనం చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఐ అనిల్‌కుమార్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు నంబర్ ప్లేట్‌లేని వాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా జాన్‌పాక రైల్వే గేటు వద్ద దిచక్రవాహనాన్ని దొంగి లించినట్లు తెలిపారు. దొంగతానికి పాల్పడిన ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పాతమల్లయ్యపాలెంకు చెందిన పుల్లగోరు శాంతి కుమార్, మహబూబాబాద్ జిల్లా గుగులోతుతండాకు చెందిన భూక్య వినయ్‌లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

గీత వృత్తిదారుల సమస్యలపై నిరంతర పోరాటాలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గీత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరాయంగా పోరాడాలని గీత పనివారల సంఘం జిల్లా కోశాధికారి నక్క నాగర్జునగౌడ్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో గీత పని వారల సంఘం 69వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు దొంతు రాంమూర్తిగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నక్క నాగార్జున మాట్లాడుతూ.....1957 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకుడు బొమ్మగాని ధర్మబిక్షం గౌడ్ గీత పనివారల సంఘాన్ని స్థాపించి కల్లుగీత కార్మికుల హక్కుల సాధన కోసం, భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటాలు నిర్వహించారని చెప్పారు. గౌడ సమస్యలపై పోరాడుతూ సంఘాన్ని జాతీయ స్థాయిలో ముందుకు తీసుకువెళ్లారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తండా సందీప్, సతీష్‌శ్రీనాధ్, మంగ వెంకన్న, రాసమల్ల పెద్ద వెంకన్న, బొమ్మకంటి ఎల్లయ్య, వీరన్న, వెంకన్న, శ్రీను, నక్క లచ్చయ్య, గుడిసె వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో గీత పనివారల సంఘం వార్షికోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా కోశాధికారి నక్కనాగార్జున గౌడ్

క్రీడా సంఘాలు అధికారికంగా గుర్తింపునివ్వాలి

న్యూ మానుకోట జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2016లో ఏర్పడ్డ కొత్త జిల్లాల క్రీడా సంఘాలు, అసోసియేషన్‌లు, ఫేడరేషన్లు అధికారికంగా గుర్తింపు నివ్వాలని న్యూ మానుకోట జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం న్యూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్‌సారధిరెడ్డి మాట్లాడుతూ... కొత్త జిల్లాల క్రీడా సంఘాలు, ఫేడరేషన్లకు గుర్తింపు ఇవ్వాలని, కొత్త జిల్లాల ప్రాతిపదికన ఎస్జీఎఫ్ఐ, క్రీడా సంఘాల రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణ, జట్ల ఎంపిక జరగాలని కోరారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదిన క్రీడా జట్ల ఎంపిక జరుగుతుందని చెప్పారు. 2025-26 విద్యాసంవత్సరంలో జరుగుతున్న ఎస్జీఎఫ్ఐ పాఠశాల, కళాశాల స్థాయి ఉమ్మడి జిల్లాల ఎంపిక ప్రక్రియలో కొత్త జిల్లాల నుంచి సెలక్షన్ కమిటీలో కనీసం ఒక్కరికి ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ సమీపంలో రూ.9 కోట్లతో టెండర్లు పిలిచి క్రీడా మైదానాన్ని చదును చేసి వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలోని ఓసీ క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఇండోర్ స్టేడియాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదా బహుళ ప్రయోజ నాలకు వినియోగించాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె. అనిల్‌కుమార్‌కు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పెరుగు కుమార్, రావుల నవీన్‌రెడ్డి, ధర్మచరణ్‌రెడ్డి, హేమంత్, పోలెపాక చరణ్, మనీష్, రాజేష్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, ఎమ్డీ. మహమూద్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో మాట్లాడుతున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. అజయ్‌సారథిరెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):మహబూబాబాద్ పట్టణంలోని పాత బజారులోని పలు కాలనీల్లో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నూతనంగా నిర్మాణం చేపడుతున్న 100 కేవీ ట్రాన్స్ ఫార్మర్ పనుల నేపద్యంలో భవానీనగర్ తండా, పోలీస్ క్వార్టర్స్ , హస్తినాపురం కాలనీ, నందన గార్డెన్స్, గోపాలపురం కాలనీల్లో ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కొత్తగూడలో మంత్రి సీతక్క పర్యటన

కొత్తగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నేడు కొత్తగూడ మండలంలో పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య తెలిపారు. ఈసందర్భంగా సారయ్య మాట్లాడుతూ మండలంలోని తిమ్మాపురంలో హెల్త్ సబ్ సెంటర్ ప్రారంభం, కొత్తగూడలో 30పడకల ఆస్పత్రి నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనుల శుంకుస్థాపనతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రి సీతక్క పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికలు

డోర్నకల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్‌లోని హనుమాన్ వ్యాయామశాలలో ఈ నెల 23న మహబూబాబాద్ జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ జట్టు ఎంపికకు పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ జనరల్ సెక్రటరీ కొత్త రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.

సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

● డీపీఆర్వో పసునూరి రాజేంద్రప్రసాద్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ -2047 సిటిజన్ సర్వేలో అందరు పాల్గొనాలని జిల్లా పౌరసంబంధాల అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పన కోసం ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ -2047 సిటిజన్ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ఇప్పటి వరకు సిటిజన్ సర్వేలో కేవలం తెలంగాణ నుంచే కాకుండా వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందించారని పేర్కొన్నారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వంద ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా 2047 వరకు తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుంచి తగు సూచనలు స్వీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వేను చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన సర్వే ఈనెల 25తో ముగుస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి సర్వే అందుబాటులో ఉన్నందున www.telangana.gov.in/telanganarising అనే వెబ్‌సైట్‌ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాలని డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ తెలిపారు.

దేవాలయ ఫెన్సింగ్ కోసం విరాళం

కేసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుగొండలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మైసమ్మ ఆలయం ఫెన్సింగ్ కోసం రూ.20వేల విరాళాన్ని సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా కేసముద్రంలో మంగళవారం ఆటో యూనియన్ సభ్యులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో షేక్ ఆసీఫ్, షేక్ ఇమామ్ పాషా, తాటి వీరన్న, నాంచారి శ్రీను, ఈసాల లక్ష్మయ్య, కొండబత్తుల నరేష్, దేవరపు వెంకన్న, తాటి ఉపెందర్, ముత్యం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రంలో సమ్మిగౌడ్‌ను సన్మానిస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

తడిసి మోపెడు..

(5వ పేజీ తరువాయి)

సుప్రీంకోర్టుకు వెళ్లడంతో గత కొద్దిరోజుల క్రితం 50 శాతంకు రిజర్వేషన్ మించకుండా పాత పద్ధతిలో ఎన్నికలను నిర్వహించాలని చెప్పడంతో బీసీలకు 42 శాతం కాకుండా రిజర్వేషన్ తగ్గె అవకాశం ఉంది. ఈ క్రమంలో మళ్లీ రిజర్వేషన్‌లను సరి చేయాల్సి ఉండడంతో ఎప్పుడు ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభమవుతుందోనని ఎదురు చూస్తున్నారు.

ఎన్నికల నిర్వహణ ఆలస్యంతో ..

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ రోజురోజుకు ఆలస్యమవుతుండడంతో ఎన్నికల బరిలో నిలవాలనుకునే రాజకీయ పార్టీల నేతలకు ఆర్థిక భారం తప్పడం లేదు. రిజర్వేషన్ ఖరారుకు ముందు ఎవరికి రిజర్వేషన్ దక్కుతుందోనన్న ఆశతో అన్ని సామాజిక వర్గాల నేతలు ఖర్చు చేయడంతో అంతగా ఇబ్బంది కలగలేదు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్‌ల ఖరారుతో కేవలం రిజర్వేషన్ అనుకూలంగా వచ్చిన సామాజిక వర్గ నేతలు మాత్రమే ఖర్చు చేయాల్సి రావడంతో ఎన్నికలకు ముందు నుంచే వారిపై మరింత భారం పడుతోంది. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ 50 శాతానికి మించకుండా ఎన్నికలు నిర్వహించాలని కోర్టు చెప్పడంతో మళ్లీ రిజర్వేషన్‌లు తారుమారుతాయన్న ఆందోళన కూడ రాజకీయ నేతల్లో మొదలైంది. తమకు అనుకూలంగా రిజర్వేషన్ వచ్చిందన్న సంతోషంతో గ్రామాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి సేవా కార్యక్రమాల పేరిట పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. 50 శాతం రిజర్వేషన్ మించకుండా పాత పద్ధతిలో ఎన్నికలను నిర్వహిస్తే కొన్నిచోట్ల బీసీ రిజర్వేషన్‌లు మారే అవకాశం ఉంది. దీంతో రాజకీయ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఏది ఎమైనా స్థానిక సంస్థల ఎన్నికలు రోజు రోజుకు ఆలస్యం కావడంతో పోటీ చేయాలనుకున్న రాజకీయ నేతలకు ఆర్థికంగా తలకు మించిన భారంగా పరిణమిస్తోంది.